# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి : అదనపు కలెక్టర్


దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడతుందని జిల్లా అదనప కలెక్టర్ ముజామిల్‌ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రజలకు సత్వర న్యాయం చేయాలన్నారు. దరఖాస్తు దారులకు న్యాయం చేసి తిరిగి దరఖాస్తు పెట్టకోకుండా అధికారులు చూడాలన్నారు. ప్రజావాణి దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం చేయడం మంచి కాదన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్వో లక్ష్మీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి : నర్సమ్మ

**మెదక్ మున్సిపాలిటీ, జూలై10 ప్రభాతవార్త:** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని అంగన్వాడీ యూనియర్ జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్వాడీ కోరికల దినం సందర్భంగా మెదక్ మార్కెట్ యార్డ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ అనేక మంది పేద ప్రజలకు పౌష్టికాహారం అందిస్తుందని, కానీ చాలీ చాలని బడ్జెట్ కేటాయింపులతో ఐసీడీఎస్ నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రకాల ప్రభుత్వ సేవలను గ్రామాలలో అందిస్తున్న వారి కష్టాలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించడం సిగ్గుచేటని మండిపడ్డారు. అనేక రకాల ఒత్తిడులతో అనారోగ్యం చెంది హార్ట్ అటాక్‌తో మరణిస్తున్నారని గుర్తు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, బసవరాజులు మాట్లాడారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు అన్నపూర్ణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు రాజ్యలక్ష్మీ, పద్మ పాల్గొన్నారు.


ఢిల్లీ వసంత్‌కు పార్టీ ఖండువా కప్పి బిఆర్ఎస్‌లోని స్వాగతం పలుకుతున్న మంత్రి హరీష్‌రావు

# కేసిఆర్‌ను బలపర్చేందుకే బిఆర్ఎస్‌లో చేరికలు

### రాష్ట్ర శాఖ మంత్రి హరీష్‌రావు

**జహీరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వాన్ని బలపర్చేందుకే ఆయా పార్టీల నాయకులు, సమాజిక నాయకులు బిఆర్ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామాజిక ఉద్యమ కారుడు ఢిల్లీ వసంత్ తన అనుచరులతో బిఆర్ఎస్ పార్టీలో చేరగా మంత్రి తీన్నరు హరీష్‌రావు పార్టీ ఖండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఢిల్లీ వసంత్ గతంలో 54 రోజుల పాటు రైతుల కొరకు ఢిల్లీ వరకు పాదయాత్ర నిర్వహించి రైతుల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. మహారాష్ట్రలో సైతం రైతులు ముఖ్యమంత్రి కేసిఆర్‌కు మద్దతు పలుకుతూ బిఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సంగమేశ్వర ప్రాజెక్ట్ ద్వార నియోజకవర్గానికి త్వరలోనే లక్ష ఎకరాలకు సాగు నీరు అందించేందుకు పనులు ఈ పాటికే ప్రారంభం అయినట్లు గుర్తు చేశారు. పట్టణంలో 50 పడకల మాత శిశు ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రజల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. గత ప్రభుత్వాల హయాంలో తాగునీటి కొరకు కిలో మాటర్లు వెళ్లి తెచ్చుకునే వారిని, ఇప్పుడు ఇంట్లోకి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నామని గుర్తు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 శాసన సభ స్థానాలను వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ కైవశం చేసుకోవడం ఖాయమన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామి చేసినా నేటి వరకు ఏ ఒక్కరికైనా ఉద్యోగం కల్పించారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథ కాలు భారత దేశంలోనే మరే రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చంటి క్రాంతి కిరణ్, రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ మహ్మద్ తన్వీర్, వి భూపాల్‌రెడ్డి, ఎం బిక్షపతి, మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, జడ్పీటిసి అరుణ విజయమోహన్‌రెడ్డి, నాయకులు వై నరోత్తం, డిక్కీ జిల్లా ఇంచార్జి జనార్ధన్, ప్రొఫెసర్ జనార్ధన్, మాధవరెడ్డి, ఢిల్లీ వసంత్ అభిమానులు, బిఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీత కార్మికులు హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

### టి.కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్


కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కల్లు గీత కార్మికులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కల్లు గీత కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కెటిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట అందోళనలు చేస్తామన్నారు. సభ్యత్వం ఉన్న ప్రతి గీత కార్మికునికి మోటార్ సైకిల్ టాడి కార్పోరేషన్ నిధులు కేటాయించి రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ ఉచితంగా సేఫ్టీ మోకులు అందించాలన్నారు. బిసి కులాల వృత్తి దారులకు ప్రభుత్వం అందజేస్తున్న రూ. లక్ష ఆర్థిక సహాయం గౌడ కులస్తుకలు, గీత కార్మికులకు వర్తింపచేయాలన్నారు. గీత కార్మికులందరికీ సాధారణ మరణాలకు సైతం రూ.5లక్షల చెల్లించేలా గీతన్న బీమా పథకం అమలు చేయాలన్నారు. గీత కార్మికుల ఎక్స్‌గ్రేసియాను పెంచాలన్నారు. మెడికల్ బోర్డు నిబంధనలు తొలిగించాలన్నారు. సొసైటీలకు 5 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టి.కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కోహెడ కొమురయ్యగౌడ్, పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, పెంటమీది శ్రీనివాస్, శ్రీనివాస్, నర్సింహులు, రవీందర్, కమలాకర్, వెంకటేశ్వర్లు, సత్తయ్య, కనకరాజ్, శ్రీనివాస్, క్రిష్ణ, శ్రీనివాస్, రవీందర్, సత్యనారాయణ, కనకయ్య, నర్సింలు పాల్గొన్నారు.

# ముక్తాపూర్‌లో అమ్మవారికి బోనాలు

**నాగల్‌గిద్ద, జులై 10, ప్రభాతవార్త:** మండలంలోని ముక్తాపూర్ గ్రామంలో భూలక్ష్మి అమ్మవారికి భోనాల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గడప గడప నుంచి మహిళలు భోనాలతో ఒక చోటు చేరుకుని అమ్మవారిని స్మరిస్తూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి భోనాలను సమర్పించి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భోనాల ఊరేగింపులో కళాకారులు వివిధ వేషాధారణలతో నృత్యాలు చేస్తుంగా, పోతరాజుల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నారు. భక్తి శ్రద్దలతో కొనసాగిన భోనాల ఊరేగింపును తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు చేరుకోవడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు (అన్నదానం) నిర్వహించారు.

# ప్రగతికి ప్రతీక పటాన్‌చెరువు

### ఫ్రీడమ్‌పార్క్, ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్, డిసిసిబి బ్యాంకు నూతన భవనాల ప్రారంభోత్సవం మంత్రి హరీష్‌రావు


150 అడుగుల జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, జులై 10, ప్రభాతవార్త:** పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నాయకత్వంలో పటాన్‌చెరువు నియోజకవర్గం అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తూ, రోజు రోజుకు అభివృద్ధిలో శరవేగంగా దూసుకెళ్తోందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రశంసలతో ముంచెత్తారు. ఇంట్లో సంక్షేమం ఇంటి ముంగట అభివృద్ధితో సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నిండు మనసుతో ఆశీర్వదించి సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం పటాన్‌చెరువు డివిజన్ పరిధిలోని మూడు కోట్ల 26 లక్షల రూపాయలతో నిర్మించిన ఫ్రీడమ్ పార్క్, 150 అడుగుల జాతీయ జెండా, 2 కోట్ల 40 లక్షల రూపాయలతో నిర్మించిన ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్, ఒక కోటి 50 లక్షల రూపాయలతో నిర్మించిన డీసీసీబీ బ్యాంకు నూతన భవనాలను స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి మంత్రి హరీష్‌రావు ప్రారంభించారు. అనంతరం రూ.కోటి 50 లక్షలతో నిర్మించ తలపెట్టిన వార్డు కార్యాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీష్‌రావు మాట్లాడారు. ఒకనాడు కాలుష్య జలాలతో పటాన్‌చెరువు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన జలాలను అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల సీఎం కేసీఆర్ పటాన్‌చెరువులో పర్యటించి వరాల జల్లు కురిపించారని గుర్తు చేశారు. సుమారు 128 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. బీరంగూడ నుండి కిష్టారెడ్డిపేట వరకు రూ.75 కోట్లతో 6 కిలోమీటర్ల మేర 100 పీట్ల రహదారిని విస్తరించి ప్రజల కలను సాకారం చేశామన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రాయి సముద్రం చెరువును అతి త్వరలో సుందరీకరణ చేస్తామని తెలిపారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిల విజ్ఞప్తి మేరకు రామచంద్రాపురంలో గల ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చేలా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. భారతి నగర్ డివిజన్ పరిధిలో బిహెచ్ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని గత కొంతకాలంగా స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నారని, వెంటనే ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ శరత్‌ను మంత్రి ఆదేశించారు. సొంత నిధులతో వికలాంగులకు స్కూటీలు అందించడంతో పాటు వందలాది మంది విద్యార్థులకు ఉచిత కానిస్టేబుల్ శిక్షణ అందించిన ఘనత ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికే దక్కిందని ప్రశంసించారు. భారతీయ జనతా పార్టీ దక్షిణాది రాష్ట్రాలకు ఏమైనా ఇచ్చింది అంటే కేవలం శిష్కప్రియులు శూన్యహస్తాలు మాత్రమే నన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శరత్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట అందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

# నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి..నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట అందోళన నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ లో అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 యేండ్లు అవుతున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతుంది తప్ప అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో నిర్ల క్ష్యం చేస్తుందన్నారు. 2017 నుంచి అంగన్‌వాడీ ఉద్యోగులకు టిఎ, డిఎలు చెల్లించడం లేదన్నారు. 2015 నుంచి నేటీ వరకు మెనూ చార్జీలు పెంచలేదన్నారు. ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనియెడల అందోళనలు ఉధృత ం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, శారద, లక్ష్మీ, విజయ, మల్లేశ్వరీ, స్వరూపరాణి, మంజుల, కవిత, ప్రేమలత, భూలక్ష్మీ, రమ, అనిత, మాధవి, వసంత తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ మీటింగ్

**మెదక్ అర్బన్, జూలై10 ప్రభాతవార్త:** సోమవారం కలెక్టరేట్‌లో ప్రైవేట్ హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం మీద డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ మీటింగ్ జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ వాలిడిటీ దాటిపోయి ఇంకా అప్లై చేయని వారికి నోటీసులు జారీ చేయాలని ఆజ్ఞాపించారు. డివిజన్ వారీగా డిప్యూటీ జిల్లా వైద్యాధికారులు రెగ్యులర్‌గా ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి ఎక్కడ కూడా మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాలని తెలిపారు. పొగాకు వాడటం వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. క్యాన్సర్, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఇదే విధంగా మండల స్థాయిలో కూడా లైన్ డిపార్ట్‌మెంట్ అందరితో మండల టాస్క్‌ఫోర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో పొగాకు ఉత్పత్తులు అమ్మకుండా నిఘా పెట్టాలని తెలిపారు. పొగుకు వల్ల కలిగే రోగాల గురించి పోస్టర్స్ తయారు చేసి అతికించాలని చెప్పారు. బస్టాండ్‌లలో, రైల్వే స్టేషన్‌లలో నిఘా ఉంచాలని తెలిపారు. పొగుకు ఉత్పత్తులు అమ్మకుండా నిఘా పెట్టాలని సూచించారు. ఒకవేళ అమ్మినట్లయితే పెనాల్టీ విధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చందు నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామ్మోహన్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్ విజయనిర్మల, డాక్టన్ అనిలా, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ఆశాకుమారి, మెదక్ మున్సిపాలిటీ అధికారులు, లెక్చరర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

# నిండు కుండలా రంగనాయకసాగర్

### నిర్విరామంగా ఎత్తిపోత ప్రక్రియ..ఆనందలో రైతులు : మంత్రి హరీష్‌రావు


రంగనాయకసాగర్‌లోకి వస్తున్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రంగనాయక సాగర్‌లోకి గోదావరి జల సవ్వడులు మొదలయ్యాయి. చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లాపూర్ పంప్ హౌస్‌లోని మోటారును రైతుల కోరిక, సిఎం కెసిఆర్ అదేశాల మేరకు ఇటీవల ప్రారంభించిన విషయం తెలిసిందే!. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికార యం త్రాంగం మోటార్లను అన్ చేసి నీటి ఎత్తిపోత చేపట్టగా ప్రస్తుతం 3 టిఎంసిలతో నిండు కండలా రంగనాయకసాగర్ దర్శనమిస్తుంది. రంగనాయకసాగర్‌లో 3 టిఎంసిల నీరు ఉండడం ఫలితంగానే యాసంగిలో బరువైన పంట పండిన విషయం తెలిసిందే!. ప్రస్తుత వర్ష కాలంలో వర్షాలు కురవక పోయినా సాగుకు ఇబ్బంది తలెత్తకుండా వానా కాలం పంటకు గోదావరి నీళ్లు అందించేలానే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది. రంగనాయకసాగర్‌లో నీళ్లు నింపుతుండడంతో ఈ ప్రాంత రైతులలో సంతోషం వ్యక్తమవుతుంది. గోదావరి జలాలు రంగనాయకసాగర్‌లో వచ్చి చేరడంతో పంట సాగుకు ఢోక లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నీటిని ఎత్తిపోయడంతో మరో వైపు పర్యాటకుల తాకిడి పెరిగింది. అదివారం రోజుకు రంగనాయకసాగర్‌లో 3 టిఎంసిల నీరు వచ్చి చేరి నిండుకుండలా మారింది. మోటార్లు అన్ చేసి రంగనాయకసాగర్ నింపుకోవడం ద్వారా బీడు భూములైన సిద్దిపేట, సిరిసిల్లాకు గోదావరి జలాలు పరవళ్ళు తొక్కాయి. దీంతో అయా జిల్లాల పరిధిలోని శనిగరం చెరువు,సిద్దిపేట నియోజకవర్గం పరిధి కలుపుకొని లక్షా పది వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. రంగనాయకసాగర్ అయకట్టు కింద మేజర్, మైనర్ కాల్వలు, కుడి కాలువ ద్వారా చేర్యాల, మద్దూరు, నంగునూర్, సిద్దిపేట అర్బన్, ఎడమ కాల్వ ద్వారా చిన్నకోడూరు, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాలలోని గ్రామాలకు సాగునీరు అందనున్నది.

**కాంగ్రెస్, బిజెపి నాయకులు కాళేశ్వరం నీళ్లను చూడండి**

కాంగ్రెస్, బిజెపి నాయకులు కాళేశ్వరం నీళ్లను చూడాలని.. ఇక్కడికి వచ్చి చూస్తే ఎన్ని నీళ్లు ఉన్నాయో తెలుస్తుందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మోటార్ల నుంచి ఉబికి వస్తున్న గోదావరి జలాలు చూసి రైతులు, ప్రజలు సంబురపడుతున్నారని తెలిపారు. వానలు లేకపోవడంతో రాత్రింబవళ్లు కాళేశ్వరం మోటార్ల ద్వారా నీళ్లు వచ్చి చేరుతున్నాయన్నారు. కాళేశ్వరం పూర్త యి నీళ్లు వస్తుంటే బిజెపి, కాంగ్రెస్ నాయకులకు కనీళ్లు వస్తున్నాయని

# సీఎంఆర్ బియ్యం డెలివరీపై సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్ అర్బన్, జూలై10 ప్రభాతవార్త:** కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యాలయంలో సోమవారం పౌర సరఫరాల శాఖ అధికారులతో, బఫర్ గోదాం ఇంచార్జిలతో, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, హమాలీ కాంట్రాక్టర్లతో సీఎంఆర్ బియ్యం డెలివరీ, గోదాంల వద్ద హామాలీల సమస్యలు, గోదాం నందు ఖాళీ స్థలం, ఇంకా డెలివరీ చేయాల్సిన బియ్యం వేగవంతంపై జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ గోదాంల వద్ద ఎక్కువ లారీలు పెండింగ్‌లో ఉండకుండా చూసుకోవాలని, లారీలు రాగానే అన్‌లోడ్ చేసేవిధంగా హామాలీ కాంట్రాక్టర్, గోదాం ఇంచార్జీలు, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ క్వాలిటీ అధికారులు నాణ్యత కలిగిన బియ్యం పాస్ చేయడంలో వేగవంతం చేయాలని సూచించారు. బియ్యం డెలివరీ పెండింగ్ ఎక్కువగా ఉన్నందున త్వరితగతిన బియ్యం డెలివరీ చేసి ఖరీఫ్, రబీ 2021-22 పూర్తి చేయాలని, అలాగే 25 శాతం పెనాల్టీతో అదనంగా అలాగే ఖరీఫ్ 2022-23, రబీ 2022-23కి సంబంధించి రోజు వారి టార్గెట్‌గా 2894.40 టన్నులు 100 ఏసీకేలా ఎఫ్‌సీఐకి పంపాలని ఆదేశించారు. ఖరీఫ్ 2021-22, రబీ 2021-22 వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిజెక్ట్ అయిన బియ్యాన్ని వెంటనే గోదాం నుండి రైస్ మిల్లర్ తిగిరి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని, వెంటనే తీసుకెళ్లే విధంగా మిల్లర్లకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. అధికారులు యుద్ధ ప్రతిపాదికన మిల్లర్లు బియ్యం డెలివరీ పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని, ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీనివాస్, బఫర్ గోదాం ఇంచార్జీలు, క్వాలిటీ కంట్రోల్ అసిస్టెంట్లు, హమాలీ కాంట్రాక్టర్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రపాల్, ఏరియా రైస్ మిల్లర్స్ రా, బాయిల్డ్ మిల్లు వారు పూర్తి స్థాయిలో సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది. రైస్ మిల్లర్లకు రోజువారి టార్గెన్ తప్పనిసరిగా డెలివరీ చేయాలని మరోసారి తెలియజేశారు.

# తిరుపతిరెడ్డిని కొనే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు

### కంఠారెడ్డి తిరుపతిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**మెదక్ మున్సిపాలిటీ, జూలై10 ప్రభాతవార్త:** మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షులను నియమించేందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులకు బాధ్యతలు అప్పచెప్పింది.. ఆ జిల్లా అధ్యక్షులు చెప్పిన పేర్లను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నియమిస్తుంది.. నిన్నా, మొన్నా పార్టీలో చేరిన నాయకులకు పదవులు కావాలంటే అంతా సులభం కాదని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల పార్టీ అధ్యక్షుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంటే కార్యకర్తల పార్టీ అని, కాంగ్రెస్ పార్టీలో బట్ట కాల్చి మీద వేసే నాయకుల భ్రమలో కార్యకర్తలు పడవద్దని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యత కార్యకర్తలపై పూర్తి స్థాయిలో ఉందన్నారు. న్యాయం చేసే బాధ్యత నాది అని ఆయన స్పష్టం చేశారు.

**ఈ నెల 13 నుండి ఆత్మగౌవర యాత్ర**

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి మెదక్ పట్టణంలో గడప గడపకు కాంగ్రెస్ ఆత్మగౌవర యాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఈ ఆత్మగౌవర యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏయే సంక్షేమ పథకాలను తీసుకురాబోతుందో ముఖ్యంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన అన్నారు.

**తిరుపతిరెడ్డి కోవర్టు అన్నవాళ్లకు కార్యకర్తలే గుణపాఠం చెపుతారు**

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవేందర్‌రెడ్డి కోవర్డు అని బట్ట కాల్చి మీద వేస్తున్న నాయకులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏ విధంగా బుద్ధి చెపుతారో మా పార్టీ కార్యకర్తలకు తెలుసని ఆయన మండిపడ్డారు. కోవరు అని అన్ని వాళ్లు దమ్ము, ధైర్యం ఉంటే పచ్చి బట్టలతో గుడికి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**జిల్లాలో 42,500 సభ్యత్వాలు**

కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన డిజిటల్ సభ్యత్వాల నమోదులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా పేరును కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు నిలబెట్టినందుకు ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. సభ్యత్వాల కార్యక్రమాలో కృషిన కార్యకర్తలందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.

**మరిత బాధ్యతగా పని చేయాలి**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మెదక్ జిల్లా మండలాల అధ్యక్షులు, పట్టణాల అధ్యక్షులను సోమవారం కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆరికి నియామక పత్రాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డ వాళ్లందరూ కార్యకర్తలతోనే సమానమని, వారు మరింతగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీ మెంబర్ మామిళ్ల ఆంజనేయులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, శ్యాంసుందర్, మంజుల, వెంకట్‌రెడ్డి, గూడూరి కృష్ణ, మండలాల అధ్యక్షులు రమణ, గోవింద్ నాయక్, లింగంగౌడ్, శ్యాంరెడ్డి, గూడూరి ఆంజనేయులు, శంకర్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న పంచాయతి కార్మికులు

## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

**బెజ్జంకి, జూలై 10, ప్రభాతవార్త:** సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారంతో 5వ రోజుకు చేరుకుంది. దీంట్లో భాగంగా మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బైటాయించి సమ్మె నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం నుంచి డాక్టర్ బి.అర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమ్మెకు వైఎస్ఆర్‌టిపి మద్దతు



పంచాయితీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌టిపి నేత

**హుస్నాబాద్ టౌన్, జూలై 10, ప్రభాతవార్త :** పల్లెల్లో ప్రజలకు సేవలందిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు ఐదు రోజులుగా హక్కుల కోసం దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటాన్ని గర్హిస్తూ వైఎస్సార్‌టిపి నియోజకవర్గ ఇన్‌చార్జి అయిలేని మల్లిఖార్జురెడ్డి కార్మికులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. సోమవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామాలకు చెందిన కార్మికులు చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి నాయకులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై గొంతెత్తిన కళాబృందం



పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం

**హుస్నాబాద్, జూలై 10, ప్రభాతవార్త :** పచ్చదనం పరిశుభ్రతపై కళాబృందం నాలుగవవార్డులో గొంతెత్తి గళమెత్తి ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలో కళాబృందంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాసరెడ్డి హాజరై ప్రజలను చైతన్యపరిచారు. పరిశుభ్రత వల్ల ఎలాంటి రోగాలు రాకుండా అరికట్టేవారమవుతామని వివరించారు. వర్షాకాల సీజన్‌లో ఎంత పరిశుభ్రంగా ఉంటే అంత మంచిదని చెప్పారు. దీంతో పాటు ప్రభుత్వం అందచేస్తున్న మొక్కలను నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మానవాళి మనుగడకు చెట్లు జీవనాధారమని వివరించారు. చెట్లతో వచ్చే ఆక్సిజన్ వాయువు వల్ల స్వచ్ఛమైన గాలితో పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆకుల రజితవెంకన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు యండి అన్వర్(వాహెబ్‌పాషా), కోఆప్షన్ సభ్యులు మహ్మద్ అయూబ్‌పాషా, వార్డు అధ్యక్షులు మెతుకు కొమురయ్య, కళాజాత బృందం సభ్యులు ఉన్నారు.

## ప్రతిపక్షాలను అణచివేయడమే హరీష్ లక్ష్యం

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరోత్తంరెడ్డి



మాట్లాడుతున్న నరోత్తంరెడ్డి

**సిద్దిపేట రూరల్, జూలై 10, ప్రభాతవార్త:** పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలను అణచి వేసే రాజకీయాలు చేయడమే మంత్రి హరీష్‌రావు లక్ష్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయిని నరోత్తంరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.3 వందల కోట్లతో కోమటి చెరువును సుందరీకరణ చేశామని చెబుతున్న మంత్రి హరీష్‌రావు ఎంత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయో ప్రజలకు చెప్పాలన్నారు. త్వరలో ప్రతి గ్రామ నిరుద్యోగ యువతతో ఉద్యమం చేపడుతామన్నారు. రంగనాయక సాగర్ పర్యటక ప్రాజెక్టా, సాగునీటి ప్రాజెక్టా రైతులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండ్ల జనార్దన్, గోపినాథ్‌రెడ్డి, తోకల ఉమా, రాజు, శశిధర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**బెజ్జంకి, జూలై 10, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దాచారం గ్రామ పంచాయతీ కార్మికుడు సన్నపు మల్లేశం ఇటీవల మృతి చెందగా సోమవారం ఎంపిటిసి సభ్యులు, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కొలిపాక రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బియ్యం అందజేశారు. ఆయన వెంట బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దీటి రాజు, బెజ్జంకి మండల ఓబీసీ అధ్యక్షులు బండిపల్లి సత్యనారాయణ, గ్రామ బూత్ అధ్యక్షులు అట్ల లక్ష్మణ్, గ్రామ నాయకులు నేతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్కటూర్‌లో పశుగ్రాసాల వారోత్సవం

**సిద్దిపేట రూరల్, జూలై 10, ప్రభాతవార్త :** ఏకవార్షిక, బహు వార్షిక పశుగ్రాసాలపై ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలని పశుసంవర్ధశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ధర్మపురి రవికుమార్ అన్నారు. ఈనెల 7 నుంచి 14 వరకు వారం రోజుల పాటు ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పశుగ్రాసాల వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్ గ్రామంలో సోమవారం బహువార్షిక పశుగ్రాసాల వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. బహు వార్షిక పశుగ్రాసాల సాగుకు రైతులను ప్రోత్సహించడానికి సభలు,సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నార. ప్రతి మండలంలో పశుగ్రాసాల ప్రాముఖ్యతను రైతులకు తెలియడం జరుగుతుందన్నారు. చొప్పునరకు యంత్రం ప్రాముఖ్యత, వివిధ పశుగ్రాసాలలో ఉన్న పోషక విలువలు రైతులకు తెలియడం జరుగుతుందన్నారు. పశుగ్రాసాల వృధాను అరికట్టడం తీసుకోవాల్సిన చర్యలును వివరించినట్లు పేర్కొన్నారు. పశుగ్రాసాల విత్తనాలపై ప్రభుత్వం అనేక సబ్సిడిలు అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పశుగ్రాసాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

# మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేక్

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:** ఉద్యోగుల,కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటియుసి అనుబంధ సంస్థ తెలంగాణా మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేక్ డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 210 జీవో ప్రకారం 25 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అంతేగాక వేతనాలు పెంచాలని డిమాండ్‌చేశారు. బకాయిలున్నా వేతనాలను వాయిదాల పద్ధతిలోనైన చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన 1000 రూపాయిలను కొన్ని మున్సిపాలిటీలలో కార్మికులకు ఇవ్వగా మరి కొన్ని మున్సిపాలిటీలలో ఇవ్వలేదని వెంటనే వారికి ఇవ్వాలని కోరారు. కార్మికుల పనిచేసే స్థలంలో అకస్మాత్తుగా చనిపోతే ఆ కుటుంబానికి రూ. 20 లక్షలు రాష్ట్రప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, రాములు, హరినాథ్‌రావు ఉద్యోగులు,కార్మికులు పాల్గొన్నారు.




మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రోజాశర్మ

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బిటి రోడ్ల నిర్మాణం చేపట్టాలి

### జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

**చిన్నకోడూరు, జూలై 10, ప్రభాతవార్త:** ప్రయాణీకులకు, బాటసారులకు ఇబ్బందులు లేకుండా రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. మండల పరిధిలోని చౌడారం మధిర గ్రామం ఎల్లమ్మజాలులో సోమవారం ఎంపిపి కూర మాణిక్యరెడ్డితో కలిసి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.85 కోట్లు నిధులు మంజూరు వచ్చినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. పనుల్లో నాణ్యతలోపించకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, సర్పంచ్ అనితబాలయ్య, బిఆర్ఎస్ నాయకులు భూమిరెడ్డి, మల్లేశంగౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో పాములపర్తి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

**మర్కుక్, జూలై 10 (ప్రభాతవార్త):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యతపై రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించగా ఇందులో మర్కుక్ మండలం పాములపర్తి విద్యార్థులు ప్రతిభను కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుండి ఈ క్విజ్ పోటీలో అనేక మంది విద్యార్థులు పాల్గొనగా పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పాల్గొన్న నాగచైతన్యరెడ్డి, కీర్తనలు ప్రథమ బహుమతి రూ.20వేలను గెలుచుకున్నారు. అలాగే ఆగస్టులో చెన్నైలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులకు రూ.20వేల పారితోషికంతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లాను రాష్ట్రస్థాయిలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, డిఈఓ, ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్, ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, పద్మ విద్యార్థులను అభినందించారు.

## పంచాయతీ కార్మికుల వంటావార్పు.. సామూహిక భోజనాలు



సామూహిక భోజనాలు చేస్తున్న పంచాయితీ కార్మికులు

**పెద్దశంకరంపేట, జూలై 10 ప్రభాతవార్త:** సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా పెద్దశంకరంపేటలో సోమవారం వినూత్నరీతిలో వంటావార్పు కార్యక్రమం చేపట్టి సామూహిక భోజనాలు చేశారు. పంచాయితీ కార్మికులు చేపట్టిన సమ్మె ఐదవ రోజుకు చేరుకున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం పట్ల వారు సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని, పంచాయితీ కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికుల సంఘం అధ్యక్షులు పల్లెబోయిన రాములు, బాధ్యులు దాసు, సురేందర్, చాకలి రాములు, సంగయ్య, మల్లేశం, సాయిలు, లచ్చమ్మ, సాయమ్మ, అధిక సంఖ్యలో ఆయా గ్రామాల పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## ఓటు వేసే విధానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

### -ఆర్డీవో బెన్‌షాలోమ్

**హుస్నాబాద్, జూలై 10,ప్రభాతవార్త :** ఓటు వేసే విధానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో బెన్‌షాలోమ్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఓటర్లు, ప్రజాప్రతినిధులకు ఈవిఎం మిషన్‌లో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్లకు ఈవిఎంల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రచార రథాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని 360 బూత్‌లు ఉన్నాయని ప్రతీ మూడు బూత్‌ల్లోని ఓటర్లకు ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టిపిసిసి మెంబర్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ ఈవిఎం మిషన్ విధానాన్ని చూపించడంవరకు బాగానేఉందని,కానీ ఎన్నికల సమయంలో ఇవే ఈవిఎంలు వినియోగిస్తారని నమ్మకం లేదన్నారు కార్యక్రమంలో వివిధ రకాల పార్టీల నాయకులు గడిపె మల్లేష్,అయిలేని మల్లిఖార్జునరెడ్డి,బత్తుల శంకర్‌బాబు,వెన్న రాజు,గొల్లపల్లి వీరాచారి,సంజీవరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

### -మండల వ్యవసాయాధికారి శ్వేత

**కొల్చారం, జూలై 10 ప్రభాతవార్త:** అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్వేత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 5వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లు అప్లికేషన్ ఫారంకు జతచేసి వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సంతోష్ కోరారు. 12న విద్యాసంస్థలను బంద్ చేయాలని కోరుతూ నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. అంతేగాక విద్యార్థులకు యూనిఫామ్ అందలేదన్నారు. వెంటనే రెండు జతల యూనిఫామ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని, అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. ఈనెల 12న ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు విశాల్, అరవింద్, శ్రీను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రాక..

**వెల్దుర్తి, జూలై 10 ప్రభాతవార్త:** నేడు(మంగళవారం) మండల కేంద్రానికి నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి విచ్చేసి పలు అభివృద్ధి పనుల ప్రారంభం, కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేయనున్నారని ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు వెల్దుర్తిలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే చర్లపల్లి, మహమ్మద్‌నగర్ తండా, రామాయపల్లి గ్రామాల్లో పంచాయితీ కార్యాలయాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## 'పది'లో ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, జూలై 10 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం కీర్తి శేషులు పట్లె సత్తయ్య 59వ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు డాక్టర్ నరేందర్ పట్లె సత్తయ్య మెమోరియల్ ట్రస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 5 వేలు, 3 వేలు, 2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులకు, ప్రజలకు వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ధృవపత్రాలను అందజేశారు. ఈ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఫౌండర్, చైర్మన్ డాక్టర్ పట్లె నరేందర్, వైస్ చైర్మన్ డాక్టర్ విజయలక్ష్మీ, రవికుమార్, కవిత, వెంకటేష్, గీతాదేవి, నర్సింలు, అశోక్, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య విద్యార్థులకు ప్రార్థన సమయంలో బ్యాండ్ అవసరం ఉందని అడగగా, త్వరలో అందజేస్తామని డాక్టర్ పట్లె నరేందర్ హామీ ఇచ్చారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి : ఏసిపి

**హుస్నాబాద్, జూలై 10, ప్రభాతవార్త :** చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్ అన్నారు. సోమవారం మండలంలోని పోతారం(ఎస్) గ్రామంలోగల మహాత్మజ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలోని బాలికలకు ఏసిపి సతీష్ నేతృత్వంలో ఫోక్సో చట్టం, బాల్య వివాహం, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, షీటీమ్స్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, సిఐ ఎర్రల కిరణ్, ఎస్ఐ తోట మహేష్, ప్రిన్సిపాల్ శైలజ, షీ టీమ్ సిబ్బంది ఎఎస్ఐ మల్లేశం పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్

## మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ కన్నుమూత

**మెదక్ అర్బన్, జూలై 10 ప్రభాతవార్త:** మెదక్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బడికోటి విఠల్‌రెడ్డి మెదక్ మున్సిపల్ చైర్మన్‌గా గతంలో పనిచేశారు. సోమవారం మధ్యాహ్నం కన్నుమూశారు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మెదక్ పట్టణ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పార్టీకి ఎనలేని సేవలు చేశారని, ఆయన సేవలు మరవలేనివని అన్నారు. అంత్యక్రియలు మంగళవారం ఉదయం జరుగనున్నట్లు తెలిపారు.



పట్టణంలోని ఆల్ఫోర్స్ విద్యాస ంస్థలో బోనాల ఉత్సవ ం దృశ్యం

## వైభవంగా బోనాల ఉత్సవ్

**హుస్నాబాద్, జూలై 10, ప్రభాతవార్త :** ఆషాఢమాసంలో ప్రజలు సుభిక్షంగా జీవనాన్ని కాంక్షిస్తూ నిర్వహించే బోనాలు రాష్ట్రంలో అత్యున్నత పాత్ర ఉందని మతసామరస్యంతో పాటు శాంతిభద్రతలకు కీలక భూమిక పోషిస్తున్న విషయాన్ని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వూట్కూరి నరేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం పట్టణంలోని ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో బోనాలు ఉత్సవ్‌ను అతివైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డితోపాటు పట్టణ మహిళలు నెత్తిన బోనంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన అంభాభవాని అంటే భవాని తెలంగాణం సమర్పించిన బంగారు బోనం జాతర బల్కంపేట ఎల్లమ్మ జాతర అంటూ చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డితో పాటు పట్టణానికి చెందిన మహిళలు, పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ మత్స్యకార దినోత్సవం



ఎర్రవల్లిలో నినాదాలు చేస్తున్న మత్స్య కార్మికులు

**మర్కుక్, జూలై 10 (ప్రభాతవార్త):** జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని సిఎం దత్తతగ్రామమైన ఎర్రవల్లిలో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం గద్దె వద్ద కొబ్బరి కాయలు కొట్టి నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా చేప పిల్లలను అందజేసి ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కెసిఆర్ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యబిక్షపతి, ఎంపిటిసి ధనలక్ష్మీకృష్ణ, పిఏసిఎస్ వైస్‌చైర్మన్ బాలరాజు, ఉపసర్పంచ్ కనకయ్య, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గ్రామ పెద్దలు సుధాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కుంట సత్యం, కోశాధికారి బోయిని స్వామి, నాయకులు బాలచంద్రం, శ్రీను, చింతకాయల స్వామి, కుంట యాదగిరి, కరుణాకర్, విజయ్, వెంకట్, స్వామి, నర్సింలు, రమేష్, సత్తయ్య పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, జూలై 10 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన మైసిగారి వెంకటేష్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, ఎంపిపి పాండుగౌడ్, ఎంపిటిసి చైతన్యశంకర్‌రెడ్డిలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఒక్కొక్కరు రూ.5వేల చొప్పున రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు కెసిఆర్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలి



పోడు భూముల పట్టాలు పంపిణీ చేయాలని వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**టేక్మాల్, జూలై 10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చంద్రుతాండ గ్రామ పంచాయతీలోగల గిరిజన ప్రజలకు పోడుభూముల పట్టాలను పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, రెవెన్యూ, జిల్లా అటవీ శాఖ అధికారులకు సర్పంచ్ స్రవంతి సర్దార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పోడు భూముల సాగులో అటు అధికారులు ఇటు గిరిజనులు చాల ఇబ్బందులు ఎదురుర్కున్న విషయం తెల్సిందే.సిఎం కెసిఆర్ రాష్ట్రంలోని పోడుభూములను పట్టాలు అందజేస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హయంలో అన్నిరంగాలను అభివృద్ధి పర్చిన ఘనత కేసిఆర్‌కే దక్కుందన్నారు. వినతి పత్రం స్వీకరించిన అధికారులు అన్‌లైన్ చెయించి పోడు భూముల పట్టాలను అందజేస్తామని సానుకూలంగా స్పందించి పట్ల తాండవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలేక్, దళిత నాయకులు తదితరులు

**నర్సాపూర్, జూలై 10, ప్రభాతవార్త:** దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆంజనేయులుకు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులకు సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేక్ మద్దతుతో ఈ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దళిత నాయకులతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేఖ్ మాట్లాడుతూ ప్రతి దళిత కుటుంబబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటిని నిర్మించి ఇవ్వాలని, 3 ఎకరాల భూమిని ఇవ్వాలని, అసైన్‌మెంట్ భూములు సాగు చేస్తున్న రైతుల అధీనంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసిల వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఆసరా పింఛన్‌లు ఇవ్వాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు శివశంకర్, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 5వ రోజుకు చేరిన పారిశుధ్య కార్మికుల రిలే నిరాహార దీక్ష

**కొల్చారం, జూలై 10 ప్రభాతవార్త:** కనీస వేతనాలు అమలు చేయాలని, గత బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రమైన కొల్చారంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారి ప్రక్కన బస్టాండ్ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న పారిశుధ్య కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న పోతరాజు రమణ

# సుప్రభాత రావు విమర్శలు అర్ధరహితం

## అధికారిక కమిటీపై ఆరోపణలా..

**రామాయంపేట,జూలై 10, ప్రభాతవార్త:**

టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు అధికారికంగా నియమించిన మండల అధ్యక్షుల కమిటీపై ఆరోపణలు చేయడం శోచనీయం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చిన్నశంకరంపేట మండల మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పోతరాజు రమణ అన్నారు. సోమవారం నాడు రామాయంపేట పట్టణంలోని మల్లన్న ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఎన్నిక చేసిన మండల పట్టణ అధ్యక్షులను విమర్శించడం సమంజసం కాదన్నారు. మేమంత 30 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేస్తున్నామని, ఎక్కడ సుప్రభాతరావు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాడని ప్రశ్నించారు. ఏనాడు ఆయన ప్రజా ఉద్యమాలలో పాల్గొనలేదని విమర్శించారు. ఎటువంటి అధికారంతో జిల్లా అధ్యక్షుడు నియమించిన ఎన్నికలను గాంధీభవన్ వద్ద కాదనడం అవివేకమన్నారు. కావాలని కొందరు జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హైదరబాద్ లోని గాంధి భవన్ పార్టీ కార్యాలయం వద్ద అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు కావాలని వారి స్వార్థ రాజకీయాల కోసమే చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్, రామాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్యామ్‌రెడ్డి, హవేలి ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పాపన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్, నిజాంపేట మండల అధ్యక్షుడు లింగంగౌడ్, నాయకులు యాదగిరి, ఆంజనేయులు, అనిల్ కుమార్, మధు, ప్రేమ్, రమేష్, కుమార్, కిషన్, హరిప్రసాద్, భాను, సతీష్, సల్మాన్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్ తదితరులున్నారు.

# ఎమ్ఎస్ఎస్‌వో సభ్యుడి మృతి

## బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : రోహిత్‌రావు



అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

**రామాయంపేట,జూలై 10, ప్రభాతవార్త:** రామాయంపేట మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎమ్ఎస్ఎస్‌వో సభ్యుడు జాలిగామ నవీన్ గౌడ్ జాండిస్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య,తల్లి అంగవైకల్యంతో బాధపడుతున్న సోదరుడు ఉన్నాడు. ఈ విషయాన్ని ఎమ్ఎస్ఎస్‌వో సభ్యుల ద్వారా తెలుసుకొని అతని అంత్యక్రియల కోసం తక్షణ సహాయంగా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్ఎస్ఎస్‌వో సభ్యుల ద్వారా మృతునికి తల్లికి అందించారు. చరవాణి ద్వారా మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ఎమ్ఎస్ఎస్‌వో టి సభ్యుడిని కోల్పోయామని దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, అతని కుటుంబానికి ప్రగాడ సానూభూతి వ్యక్తం చేశారు. అతని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, గ్రామస్తులు మైనంపల్లి రోహిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్ఎస్‌వో నియెజకవర్గ బాధ్యులు శ్రీధర్‌రెడ్డి, పరశురాం, ఎమ్ఎస్ఎస్‌వో రామాయంపేట మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ సాగర్, రామాయంపేట టౌన్ అధ్యక్షులు చింటు చారి, భరత్, అజయ్,రవితేజ, మహమ్మద్, అబ్బాస్, శ్రీకాంత్‌రెడ్డి, లింగం, జార్జిరెడ్డి, సాయగౌడ్, మహిపాల్ గ్రామస్తులు పాల్గొన్నార

# పాత పెన్షన్ అమలుకు డిమాండ్



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎల్లయ్య

**చిన్నశంకరంపేట,జూలై 10, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సిపిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం చిన్నశంకరంపేటలో మాట్లాడుతూ ఈ నెల 16 నుండి పెన్షన్ సంకల్ప బస్సు యాత్ర గద్వాల్ జోగులాంబ అమ్మవారి సన్నిది నుండి ప్రారంబమై 31 నాడు యాదాద్రిలో ముగియనున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 12న ఛలో హైదరబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గోనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్‌సింగ్, కోశాధికారి చంద్రం, దేవయ్య, రత్నాకర్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న రెవెన్యూ డివిజన్ దీక్షలు

**రామాయంపేట,జూలై 10, ప్రభాతవార్త:**

రామాయంపేటను రెవెన్యూ డివిజన్ కేంద్రముగా ఏర్పాటు చేయాలని చేస్తున్న రిలే నిరహార దీక్షలు సోమవారం నాటికి 106వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 106 రోజులు గడిచినప్పటికి స్థానిక నాయకులు గాని, స్థానిక ఎమ్మెల్యే గాని స్పందించకపోవడం బాధకరమని అన్నారు. రెవెన్యూ డివిజన్ సాధనకై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ముందుకు రావాలన్నారు. లేని పక్షంలో రాబోమే అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థిని ఓడగోట్టి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మైనార్టీలకు అన్యాయం

## -ఎంఐఎం తాలూకా అధ్యక్షులు గుల్షన్

**కొడంగల్,జూలై 10ప్రభాతవార్త**

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఎంఐఎం తాలూకా అధ్యక్షులు ఎస్బీ.గుల్షన్ అన్నారు.సోమవారం కొడంగల్‌లో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతు బీఆర్ఎస్ ప్రభుత్వ హామీలు, మభ్య పెట్టే మాటలతో మైనార్టీ ప్రజలు విసుగు చెందారని ఆరోపిం చారు.రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు కార్పోరేషన్ రుణాలు అందిస్తామని చెప్పడంతో నిరుపేద ప్రజలు మీసేవ కేంద్రాల్లో డబ్బులు వెచ్చించి ధరఖాస్తులు చేసుకున్నా నేటి వరకు అందిం చకపోవడంతో ఫలితం లేకపోయిందన్నారు.మైనార్టీ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్న ప్రభుత్వం కేవలం కాగితాలకు ప్రకటనలు ఇవ్వడం తప్ప చేపసింది ఏమి లేదన్నారు.ఓట్లను దండుకోవడం తప్ప వారి సంక్షేమానికి చేసింది శున్యమన్నారు. మైనార్టీల పట్ల వివక్ష చూపుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగి న గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.సమావేశంలో పార్టీ నాయకులుషేక్ రుమాన్,ఎండీ.ముర్తుజా,హుస్సేన్,షేక్ అబీద్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ అజర్,ఎండీ. ముబీన్, అర్షద్, ఏజా జ్,ఎండీ.జఫర్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మురుగుకాల్వల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి తొంట యాదమ్మ

# నిజాంపూర్‌లో మురుగుకాల్వల నిర్మాణం ప్రారంభం

**సదాశివపేట, జులై 10, ప్రభాతవార్త:** మండలంలోని నిజాంపూర్ గ్రామంలో 4 లక్షల ఎంపిటిసి నిధులతో మురుగుకాల్వల నిర్మాణాన్ని ఎంపిపి అధ్యక్షులు తొంట యాదమ్మతో కలిసి బిఆర్ఎస్ యువ నేత చింత సాయినాథ్ పనులను భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చింత సాయినాథ్ మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ద వహిస్తోందన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో గ్రామాలు అభివృద్ధి దశలో పయనిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని రమేష్‌కు చెందిన ఎరువుల దుకాణ నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామంలో క్రైస్తవులు జరుపుకుంటున్న పస్కల పండగలో పాల్గొని క్రైస్తవులకు చింత సాయినాథ్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మాధవరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రత్నాకర్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ చాకలి రవి, సొసైటీ డైరెక్టర్ విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు రమేష్ కుమ్మరి, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు రాములు, రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హత్నూర మండల

# కాంగ్రెస్‌పార్టీలో గాలి దుమారం

**నూతన అధ్యక్షుడిని అంగీకరించం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక సమావేశం**



సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు

**హత్నూర జులై 10, ప్రభాతవార్త:** హత్నూర మండల కాంగ్రెస్‌పార్టీలో గాలి దుమారం రేగుతోంది.హత్నూర మండల పార్టీ నూతన అధ్యక్షునిగా కె.కృష్ణను నియమిస్తూ పార్టీ ఆదిష్టానం ఈనెల 5న, ఉత్తర్వులు జారీ చేయడంతో ఒక్కసారిగి పార్టీలోని విబేదాలు బయట పడ్డాయి.ఎవరిని సంప్రదించకుండా నూతన అధ్యక్షుడిని ఏలా ప్రకటిస్తారంటూ,సోమవారం హత్నూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముఖ్యనాయకులు దౌల్తాబాద్ సమీపంలోని ఓఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తలు,నాయకులు ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి, కొత్త అధ్యక్షుడి నియమకాన్ని ఆంగీకరించేది లేదని, ఇంత వరకు అధ్యక్షునిగా పనిచేసిన బోర్పట్ల గ్రామానికి చెందిన పోట్లచెరువు కిష్టయ్యను ఎకగ్రీవంగా నియమిస్తూన్నామని ఎకగ్రంగా తీర్మానంను ఆమోదించారు. వచ్చే శాసనసభ ఎన్నికల వరకు పోట్లచెరువు కిష్టయ్యను కొనసాగేవిధంగా తీర్మానం చేశారు. తీర్మానంపై సమావేశానికి హజరైన ముఖ్య నాయకులు,కార్యకర్తలు సంతకాలు చేశారు. కర్రెకిష్ణను అధ్యక్షుడిగా అంగీకరించే ప్రసక్తిలేదని వారు తేల్చి చెప్పారు. ఇప్పటి వరకు ఐక్యంగా ఉంటూ, కలిసి పనిచేసిన హత్నూర మండలంలోని కాంగ్రెస్‌పార్టీ నాయకుల్లో,కార్యకర్తల్లో గాలి అనిల్ కుమార్ చిచ్చు పెడుతున్నాడని సమావేంలో పాల్గోన్న పలువురు నాయ కులు, కార్యకర్తలు ఆరోపించారు. గాలి అనిల్ కుమార్ పార్టీ అదిష్టానానికి తప్పు దోవ పట్టిస్తూ పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తూన్నాడని వారు ఆరోపించారు. కార్యకర్తల సమావేశంలో కార్యకర్తలు,నాయకుల నుండి సేకరించిన అబిప్రాయాన్ని పార్టీ అదిష్టానానికి పంపిస్తామని కార్యకర్తల సమావేశంలో అధ్యక్షునిగా ఎన్నికైన పోట్లచెరువు కిష్టయ్య ఈసందర్బంగా మాట్లాడుతూ తెలిపారు.

# సన్మానం అందుకున్న మనూర్ పాఠశాల బాధ్యులు



ప్రధానోపాధ్యాడిని సన్మానిస్తున్న పిఎస్ఆర్ యువసేన అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి

**మనూర్, జులై 10, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఏకంగా 13 మంది విద్యార్థులు (2023-24 విద్యాసంవత్సరానికి) ట్రిబుల్ ఐటిలో అడ్మిషన్‌లు అందుకోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను పోతుల సంగారెడ్డి యేవసేన (పిఎస్ఆర్) అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. మనూర్ జడ్పిహెచ్ఎస్ నుంచి 13 మంది విద్యార్థులు ఇటీవల ముగిసిన 10 వార్షిక పరీక్షల్లో 10 జిపిఏ సాధించి ట్రిబుల్ ఐటిలో చేరేలా ప్రోత్సాహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగారం శ్రీనివాస్ నేతృత్వంలో ఉపాధ్యాయులు యాదగిరి, చంద్రకాంత్, లక్ష్మణ్, మల్లికార్జున్, ధన్‌సింగ్, సత్తయ్య, రాజు, విజయ్‌కుమార్, రామ కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, కిష్టయ్య, సంగ్రామ్, శివలింగం, బీంరావు, సాంకీ బాయి, శివశేఖర్, విజయ లక్ష్మిలను పిఎస్ఆర్ యువసేన అధ్యక్షులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అటెండర్ యాదగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ రోగనిరోధకాలపై దృష్టి

**పటాన్‌చెరువు, జులై 10, ప్రభాతవార్త:** అంటువ్యాధుల నివారణ కోసం ఉత్పత్తి చేసే రోగనిరోధక ఔషదాల ప్రత్యామ్నాయ ఉత్పత్తి మార్గాలపై దృష్టి సారించాలని మలేసియాలోని యూఐటీఎం మారా సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రవి శేషాల సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'రోగనిరోధక శక్తికి మూలాలుగా మొక్కలు, ఔషద పంపిణీ మార్గాలు' అనే అంశంపై సోమవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. ఈ విద్యాసంస్థకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో ఉన్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంటువ్యాధులు, వాటికి కారణమయ్యే సూక్ష్మజీవుల గురించి డాక్టర్ రవి వివరించారు. సూక్ష్మజీవుల ద్వారా సంక్రమించే వ్యాధులకు రోగనిరోధక శక్తిని కలిగి ఉండడం, దానిని పెంపొందించుకునేందుకు ప్రత్యామ్నాయ వనరులను కలిగి ఉండవలసిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో ఔషద మొక్కల పాత్ర గురించి, దానిపై వారు చేపట్టిన పరిశోధనలను ఆయన వివరించారు. అనంతరం విద్యా ర్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన జవాబులిచ్చారు. తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథిని స్వాగతించగా, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ పి.హైమ ఆయనను విద్యార్థులకు పరిచయం చేశారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కిషన్ రెడ్డిని కలిసిన వీటి విజయ్ కుమార్

**శంషాబాద్ జూలై10,ప్రభాతవార్త :**

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని చేవెళ్ల నియోజకవర్గం బిజెపి నాయకుడు వర్రీ తులసి రామ్ విజయ్ కుమార్ సోమవారం కలిసి అభినందించారు.బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం అనంతరం కిషన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు.కిషన్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమాందర్ రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు,బిజెపి సీనియర్ నాయకులు కాసాని వెంకటేష్,టి వీరేందర్ గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ...కిషన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని అన్నారు.బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలతో విసిగిపోయిన ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని ప్రజల ఆధార అభిమానాలతో భారీ మెజార్టీతో బిజెపి అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.సమర్థవంతుడైన కిషన్ రెడ్డి నేతృత్వంలో బిజెపి మరింత పటిష్టంగా మారున్నదని వీటి విజయ్ కుమార్ అన్నారు.



రామచంద్రారెడ్డినగర్‌లో డ్రైనేజి సమస్యను పరిశీలిస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

# రామచంద్రారెడ్డినగర్‌లో డ్రైనేజి సమస్య పరిష్కారం

**రామచంద్రాపురం, జులై 10, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్‌లో నెలకొన్న డ్రైనేజి సమస్యను సోమవారం స్థానిక కార్పోరేటర్ పుష్పనగేష్ పరిష్కరించారు. రామచంద్రారెడ్డి నగర్‌లో గత కొన్ని రోజులుగా డ్రైనేజి నీరు, వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతుండటంతో కాలనీ వాసులు పలు ఇబ్బందులకు, అవస్థలకు గురిఅవుతూ వస్తున్నారు. కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న కార్పోరేటర్ పుష్పనగేస్ తన స్వంత నిధులతో ఇటాచి యంత్రాన్ని మల్లికార్జున నగర్ కృష్ణుడి ఆలయం పక్కన ఉన్న నాలా వద్ద ఔట్లెట్‌ను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ డీఈ సురేందర్, ఏఈ ప్రభు, జలమండలి మేనేజర్ జనార్ధన్‌తో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు కార్పోరేటర్ పుష్పనగేష్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షం కురిసినా కాలనీలో నీరు నిల్వకుంటా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కృష్ణుడి ఆలయం ముందు డ్రైనేజి నీరు నాలాలోకి సాఫీగా వెళ్లేలా నూతన పైప్‌లైన్ ప్రతిపాధన చేయాలని జలమండలి మేనేజర్ జనార్ధన్‌కు సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రఘురాంరెడ్డి, బాధ్యులు చంద్రశేఖర్ గుప్త, బాల్‌రెడ్డి,కిష్టరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, రాజిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, సత్యనారాయణ, సిఎం రమేష్, మల్లేష్, కుమ్మరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భారతీనగర్ వరకు ఆర్టీసి సేవలు పునరుద్దరించాలి



ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం అందచేస్తున్న అంజిరెడ్డి

**రామచంద్రాపురం, జులై 10, ప్రభాతవార్త:** భారతీ నగర్ డివిజన్ వరకు ఆర్‌టిసి సేవలను పునరుద్దరించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోదావిరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి రామచంద్రాపురం పట్టణం ఎల్ఐజి కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి గోదావరి అంజిరెడ్డి పూలమాలలు వేసి అక్కడి నుంచి ర్యాలీగా ఎల్ఐజి బస్టాప్ వరకు చేరుకుని డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సంరదర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ లక్ష మంది వరకు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో గతంలో పటాన్‌చెరు నుంచి హైద్రాబాద్, సికింద్రాబాద్ వరకు ఎల్ఐజి, బీహెచ్ఈఎల్ మాక్స్ సొసైటీ, ఎంఐజి కాలనీల మీదుగా ఆర్టీసి సర్వీసులు నడిచేవని గుర్తు చేశారు. ఈ ప్రాంతా గుండా బస్సు సౌకర్యం లేక పోవడంతో ఆయా కాలనీ వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సివస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసి అధికారులు స్పందించి గతంలో లాగ ఆయా ప్రాంతాల గుండా బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు మన్నె శ్రీకాంత్, మాజీ అధ్యక్షులు సందారెడ్డి, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ఉపాధ్యక్షులు నారాయణ, రాములు, కనకరాజు, రాజేంద్ర, మహిళా మోర్చ నాయకురాలు రత్నకుమారి, పద్మ, దివ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షత చూపితే కఠిన చర్యలు : ఏసిపి రమేష్



తిమ్మాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసిపి రమేష్, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, జులై 10 (ప్రభాతవార్త):** గ్రామంలో ఎవరైనా కుల వివక్షత చూపించినట్లయితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, సమాజంలో అందరూ సమానమేనని గజ్వేల్ ఏసిపి రమేష్ అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామాన్ని ఏసిపి రమేష్ గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, తహసీల్దార్ రఘువీరారెడ్డితో కలిసి సందర్శించారు. ముందుగా గ్రామంలోని వివిధ కుల పెద్దలతో మాట్లాడి తదనంతరం గ్రామస్తులతో గ్రామంలో సమావేశమై కుల వివక్షత చూపడం సరికాదని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని, గ్రామాల్లో ఎలాంటి కుల వివక్షతకు పాల్పడవద్దని హెచ్చరించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం నడుచుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. కుల వివక్షత చూపించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కంప్యూటర్ యుగంలో కుల వివక్షత ఏమిటని, సమాజంలో ఒకరికొకరు సహకరించుకోవాలని, అందరూ మనుషులేనని అన్నారు. అదేవిధంగా సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, సోషల్ మీడియాలో ఒక వర్గానికి కానీ ఒక కులానికి కానీ సంబంధించిన విధంగా పోస్టులు పెడితే వారిపై మరియు సంబంధిత గ్రూప్ అడ్మిన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకనైనా గ్రామంలో అందరూ కలిసిమెలసి ఉండాలని, అందరిని సమానంగా చూడాలని వివిధ కుల పెద్దలకు సూచించారు. గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణమూర్తి, స్థానిక సర్పంచ్ లక్ష్మి రమేష్, వివిధ కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# హాఫ్ మారథాన్ రన్ గోడ పత్రిక ఆవిష్కరణ



గోడ పత్రికను అవిష్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జూలై 10, ప్రభాతవార్త :** సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో అగస్టు 6న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ రన్ గోడపత్రికను సోమవారం టియుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షులు కలకుంట్ల రంగాచారి పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో అవిష్కరించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ హాఫ్ మారథాన్ రన్‌కు జర్నలిస్టులసంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అందరికి అరోగ్యం పంచడమే లక్ష్యంగా పని చేస్తున్న సిద్దిపేట అసోసియేషన్ సభ్యులకు తప్పకుండా సహకారం అందిస్తామన్నారు. జర్నలిస్టులు సైతం రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి క్రీడాకారుల్లో మారథాన్ పరుగు తెలియజేయటకు, ప్రోత్సాహపరిచేందుకే హాఫ్ మారథాన్ రన్ నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశామన్నారు. హెచ్‌టిటిపిఎస్:// ఎస్‌హెచ్ఎం23.ఐక్యూ301.సిఓఎం ఈ లింక్ ద్వారా రిజిస్టేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అరుట్ల యాదవరెడ్డి, అకుల పాండురంగం, నాయిని సంజీవరెడ్డి, చిట్కూల మైసారెడ్డి, అర్కే, జానీ, సాజిద్, యూసుఫ్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు బాపురెడ్డి, రాజు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఝరాసంగంలో సమ్మె నిర్వహిస్తున్న పంచాయితీ సిబ్బంది

# ఝరాసంగంలో పంచాయతీ సిబ్బంది సమ్మె

ఝరాసంగం, జులై 10, ప్రభాతవార్త: గ్రామ పంచాయితీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రమైన ఝరాసంగంలో పంచాయితీ సిబ్బంది సమ్మెను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్ర, మండల కార్మిక సంఘం అధ్యక్షులు బి సంగన్న, ఇస్మాయిల్‌లు మాట్లాడుతూ పంచాయితీ సిబ్బంది అందరిని పర్మనెంట్ చేయాలన్నారు. 11వ పిఆర్‌సిలో నిర్ణయించిన 19వేల బేసిక్‌ను చెల్లించాలని, అంత వరకు జిఓ 60 ప్రకారం స్వీపర్లకు 15వేలు పంపు ఆపరే టర్లకు, ఎలక్ట్రీషియన్లకు, డ్రైవర్‌లకు, కారోబార్‌లకు, బిల్ కలెక్టర్‌లకు 19వేల 5వందల రూపాయలు చెల్లించాలన్నారు. ప్రమాదం జరిగిన మరణించిన కార్మికుని కుటుంబానికి 10లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. 51 జీఓను సవరించాలని, మల్టిపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, సిబ్బందికి పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా, గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్మిక సంఘం సహ కార్యదర్శి సుధీర్, విజయ్, లక్ష్మి, కార్మిక సిబ్బంది దిగంబర్, అశోక్, గైబన్న, దావీదు, రాందాస్, దేవదాస్, రాజారత్నం, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆషాడ మాసం బోనాల పండుగ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న కాట శ్రీనివాస్‌గౌడ్

**పటాన్‌చెరువు, జులై 10, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సంప్రదా యాలకు ప్రతీకైన బోనాల పండుగ సందర్భంగా జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవంలో పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని, ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, ఎంపిపి రవీందర్‌గౌడ్, ఎంపిటిసి జనాభాయి, గ్రామ అధ్యక్షులు అర్జున్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుమార్, చంద్రయ్య, సత్తయ్య, వెంకటేష్, రమణ, వై.శ్రీనివాస్, సత్యం, సుధాకర్, అర్జున్, ఆంజనేయులు, సందీప్, కరుణాకర్, శ్రీనివాస్, సాయి, కుమార్, రాజు, హరివర్ధన్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన జిన్నారం యువత



యువకులకు బిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, జులై 10, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అంటేనే కార్యకర్తల పార్టీ అని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీతోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన జిన్నారం గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్బంగా యువకులందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు పరిపాలన వ్యవస్థలోను యువతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. బిఆర్ఎస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుల వల్లే చూసుకోవడంతో పాటు, కష్టనష్టాల్లో అండగా ఉంటున్నామని తెలిపారు. పార్టీలో చేరిన యువకులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంజీవ, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బాలిక చదువుకు యూత్ క్లబ్ చేయూత

**పెద్దేముల్, జులై 10, ప్రభాతవార్త:**

అవ్వ సంరక్షణలో తాండాలో నివసిస్తు, తల్లిదండ్రులు లేని గిరిజన బాలికను చదివించేందుకు పెద్దేముల్ యూత్ క్లబ్ సభ్యులు ముందుకు వచ్చారు. పెద్దేముల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గిరిజన బాలిక రాధిక రాథో డ్‌ను పెద్దేముల్ యూత్ క్లబ్ ప్రతినిధులు దత్తత తీసుకొని ఉన్నత చదువులు చది వించేందుకు సోమవారం స్కూల్ బ్యాగ్, నోటు పుస్తకాలు, టిఫిన్ బాక్స్ ఇతర వస్తువులతో కూడిన స్టడి కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా యూత్ క్లబ్ ప్రతినిధులు పరియాద అరుణ్, అల్లెంకల అఖిల్ మాట్లాడుతూ ఇప్పటి నుంచి ప్రతి నెల వారి కుటుంబానికి అవసరమయ్యే రేషన్ సరుకులను తామే అందిస్తా మని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శాంతప్ప, ఆంగ్ల ఉపాధ్యా యుడు ద్యావరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన బాలిక రాధిక రాథోడ్‌ను ఉన్నత చదువులు చదివించేందుకు దత్తత తీసుకున్న పెద్దేముల్ యూత్ క్లబ్ ప్రతి నిధులు అభినందనీయులని అన్నారు.కార్యక్రమంలో యూత్ క్లబ్ సభ్యులు క్రిష్ణ, చిన్న, నరేష్, తరుణ్, శ్రీరామ్, పరియాద ప్రవీన్, ఆదర్శ్‌రెడ్డి, చందు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపికి పూర్వ వైభవం తీసుకువస్తా

**కుల్కచర్ల జులై 10, ప్రభాతవార్త:**

పరిగి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టికి బలమైన కార్యకర్తలు ఉన్నారని వారందరి సహకారంతో పరిగి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకువస్తానని టిడిపి జాతీయ కార్యదర్శి,పరిగి నియోజకవర్గ ఇంచార్జి కాసాని వీరేష్ ముదిరాజ్ అన్నారు.సోమవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిదిలోని బొంరెడ్డి పల్లి గ్రామంలో బోయిని అంజిలయ్య అకస్మికంగా మరణించడంతో భాదిత కుటుంబానికి భరోసా కల్పిస్తూ కుటుంబ సబ్యులకు 5000రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి పియోజక వర్గంలో 50శాతానికి పైగా ఉన్న బిసి సామాజిక వర్గానికి రాజ్యాధికారం ఇవ్వ కుండా కుటిల రాజకీయాలు అవలంబిస్తూ కేవలం ఒక సామాజిక వర్గానికి మాత్రమే టికెట్లు కేటాయిస్తూ బిసి సామాజిక వర్గానికి తీరని అన్యాయానికి గురి చేశార ని తెలుగుదేశం పార్టి పూర్తి సహకారంతో పరిగిలో బిసి వర్గానికే టికెట్ కేటాయిం చబడుతుందని ప్రజలు ఆలోచించి అసెంబ్లి ఎన్నికల్లోగా చైతన్యం తెచ్చుకుని బిసి అభ్యర్థికి పట్టం కట్టేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరికొద్ది రోజుల్లో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు జరిపి బడుగు బలహీన వర్గాలను ఏకం చేస్తానని అన్నారు.